

చిరిగిపోయిన ఫ్లెక్సీతో ఉన్న టీడీపీ ప్రచార వాహనం

టీడీపీ ప్రచార వాహనంపై

'వైసీపీ' దాడి

పెళ్లకూరు, ఏప్రిల్ 15: టీడీపీ ప్రచార వాహనంపై వైసీపీ కార్యకర్త దాడి చేశాడు. టీడీపీ నాయకులు తెలిపిన వివరాల మేరకు.. పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామంలో సోమవారం ప్రచారం చేస్తున్న టీడీపీ వాహనంపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆళ్ల నాగార్జున దాడికి దిగాడు. వాహనానికి కట్టి ఉన్న ఫ్లెక్సీలను కర్రతో కొట్టి చించేశాడు. అనంతరం వాహన డ్రైవర్ నెలవల గోపిపైనా కర్రతో దాడికి యత్నించగా, స్థానికులు నిలువరించారు. దాంతో వాహనాన్ని తీసుకుని డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకుని వచ్చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం వెంటనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు డ్రైవర్ కూడా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని విచారించి, నాగార్జున ఆచూకీపై ఆరా తీశారు. సాయంత్రం స్థానిక టీడీపీ నేతలతో కలిసి నెలవల సుబ్రహ్మణ్యం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దాడికి పాల్పడిన వారితోపాటు అతడిని ప్రోత్సహించిన ఎన్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరారు. దీనిపై ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధలను అతిక్రమించి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎన్నికల నిబంధనల మేరకు కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఎస్‌ఐతో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు

సూళ్లూరుపేట వైసీపీలో

ఆరని జ్వాలలు

తారస్థాయికి చేరిన ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గాల విభేదాలు

ఎన్డీసీసీబీ ఛైర్మన్ నుంచి నాకు ప్రాణహాని : పోలీసులకు పట్టణ అధ్యక్షుడి ఫిర్యాదు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: సూళ్లూరుపేట వైసీపీలో వర్గవిభేదాల కారణంగా చెలరేగిన జ్వాలలు ఇప్పట్లో ఆరేలా లేవు. వర్గవిభేదాలు తారస్థాయికి చేరాయి. కొంతకాలంగా ఎన్డీసీసీబీ (నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు) ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి (ఎమ్మెల్యే అనుకూల వర్గం), సూళ్లూరుపేట వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి (ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం) మధ్య వర్గవిభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇరువరాలూ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు కూడా చేసుకుని ఉన్నారు. ఎన్నికల వేళ వర్గవిభేదాలు మంచిది కాదని పార్టీ అధిష్ఠానం పెద్దలు ఇరు వర్గాలకు నచ్చచెప్పారు. అయినా వారు ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తొలిసారిగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి వర్గీయులు.. కళత్తూరు శేఖర్‌రెడ్డిపై దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి, సర్దుబాటు చేయాల్సి ఉంది. మరోవైపు పార్టీ నాయకుడిపై ప్రచారంలో దాడికి దిగడం ఏంటంటూ మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్‌రెడ్డిలు శేఖర్‌రెడ్డికి మద్దతుగా ప్రతిఘటనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులు శేఖర్‌రెడ్డి వర్గీయులకు నచ్చచెప్పి అక్కడినుంచి పంపించేశారు. ఈ క్రమంలో సత్యనారాయణరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ శేఖర్ రెడ్డి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రహీంరెడ్డికి ఫిర్యాదు చేశారు.



ఎస్‌ఐ రహీం రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కళత్తూరు శేఖర్ రెడ్డి

కాల్చి చంపేస్తానంటున్న ఎన్డీసీసీబీ ఛైర్మన్

- వైసీపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

ఎన్డీసీసీబీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి చేసే గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించాననే తనపై కక్ష కట్టాడని సూళ్లూరుపేట వైసీపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. ప్రచారంలో ఉన్న తనపై ఆయన వర్గీయులతో దాడి చేయించాలని చూశారని ఆరోపించారు. 'నిన్ను నా గన్‌మ్యాన్‌తో కాల్చి చంపేస్తాను. ఎవరూ నిన్ను కాపాడరు' అని ఎన్డీసీసీబీ ఛైర్మన్ పదే పదే బెదిరిస్తున్నాడని శేఖర్‌రెడ్డి వాపోయారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకి సైతం చెప్పానని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే ప్రచారంలో తనపై దాడికి ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పలమనేరులో షర్మిల సభకు తరలివచ్చిన జనం

• నారాయణస్వామి

లిక్కర్ బాటిల్ మంత్రి

- నాసిరకం మద్యం అమ్మించడంతో పెరిగిన మరణాలు
- వెంకటేగౌడకు మరోసారి ఓటేస్తే ప్రజల్నీ అమ్మేస్తాడు
- ఎన్నికల సభల్లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శ
- కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ ఓటర్లకు పిలుపు



బంగారుపాళ్యంలో సోమవారం రాత్రి జరిగిన సభలో అభివాదం చేస్తున్న షర్మిల

అభ్యర్థులను గెలిపించమని..

కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో జరిగిన బహిరంగ సభల్లో జీడీనెల్లూరు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు రమేష్‌బాబు, శివశంకర్, ఎంఎస్ బాబులను పరిచయం చేశారు. ఓట్లేసి గెలిపించాలని, అందుబాటులో ఉండి సమస్యల్ని పరిష్కరిస్తారని కోరారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, బంగారుపాళ్యంలో వామపక్ష నాయకులు ప్రసంగించారు.

పలమనేరు/బంగారుపాళ్యం/కార్వేటినగరం, ఏప్రిల్ 15: జిల్లాలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మీద పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఆగ్రహించారు. కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యంలలో ఆమె పర్యటన సాగింది. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వంపై, ఇద్దరు ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

కార్వేటినగరం సభలో..

'జగన్‌తో పాటు నారాయణస్వామికి ఓట్లేసి గెలిపించారు. ఆయన డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ మినిస్టర్ అంట కదా.. అంటే ఏమిటో తెలుసా.. లిక్కర్ బాటిల్ మంత్రి. లిక్కర్ షాపుల్లో భూం భూం, స్పెషల్ స్టేటస్, ప్రెసిడెంట్ మెడల్ అన్నీ ఈయనవే అంట కదా. బాగా సంపాదించారు. దళితుడు. అంబేడ్కర్ శిష్యుడ్ని అని చెప్పుకుంటాడు కదా. అంబేడ్కర్ ఆశయాలను నిలబెట్టడం అంటే మద్యం అమ్మడమా.. అది కూడా కల్తీ మద్యం అమ్మడమా.. నాసిరకం మందుతో మిగతా రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో 25 శాతం ఎక్కువ మంది కిడ్నీలు, లివర్లు చెడిపోయి చనిపోతున్నారు. అయినా అవే నాసిరకం మద్యం అమ్మకాలు. బయట క్వార్టర్ బాటిల్ రూ.60 అయితే, మన వద్ద రూ.250 అమ్ముతున్నారు. నిజమేనా?' అని జనాన్ని అడిగారు. వారి నుంచి సమాధానాలు రాబట్టారు.

పలమనేరు సభలో..

'మీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పరిపాలన ఎలా ఉంది? ఎప్పుడైనా వస్తున్నారా? సమస్యల్ని పరిష్కరిస్తున్నారా? మీరు ఓటేసి గెలిపిస్తే నెత్తి మీద టోపీ పెట్టారు. ఇసుక, మట్టి మాఫియాతో బాగా సంపాదించారు. నదిలో ఇసుక లేకుండా మొత్తం అమ్ముకున్నాడట కదా. మరోసారి ఓటేస్తే మిమ్మల్ని కూడా అమ్మేస్తాడు. నియోజకవర్గంలోని భూముల్ని, ప్రజల్ని మొత్తంగా అమ్మేస్తాడు' అంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

బంగారుపాళ్యం సభలో.. : 'ఈసారి ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ అభ్యర్థులు బాగా డబ్బులిస్తారు. ఎవరు డబ్బిచ్చినా తీసుకోండి. కానీ ఓటు మాత్రం మనస్సాక్షి మేరకు వేయండి. ఓటు తల్లి, చెల్లి లాంటిది. అమ్ముకోకండి. జగన్ చెప్పిన వాగ్దానాలన్నీ మద్యం షాపుల్లో నిలబెట్టుకున్నారు. అమ్మఒడి ఇద్దరికి ఇస్తానని ఒకరికే ఇస్తున్నారు. మరోబిడ్డను దత్తత ఇచ్చేయాలా? చంపేసుకోవాలా? పులి కడుపున పులే పుడుతుంది. నా గుండెల్లో నిజాయితీ ఉంది. గెలిపించండి. వైఎస్సార్ సంక్షేమాన్ని తెస్తాను' అని జనానికి హామీలిచ్చారు.

కరచాలనాలు.. ఆత్మీయ పలకరింపులు



ప్రతి సభలోనూ పదే పదే 'హస్తం గుర్తుకు ఓటేయండి. హస్తం గుర్తును మర్చిపోకండి'అంటూ షర్మిల కోరుతూ హస్తం గుర్తును ప్లకార్డును చేత్తో పట్టుకుని చూపించారు. ఆశీర్వదించండి అంటూ పదే పదే కోరారు. రొటీన్‌గా ప్రసంగించకుండా హాజరైన వారిని ప్రశ్నలడిగి జవాబులు చెప్పించారు. మూడు సభల్లోనూ పెద్దఎత్తున షర్మిలను చూసేందుకు, ఆమె ప్రసంగం వినేందుకు ప్రజలు తరలివచ్చారు. మహిళలు, వృద్ధులు, ముస్లింలు అధిక సంఖ్యలో కనిపించారు. ముఖ్యంగా మహిళలు భుజాన కాంగ్రెస్ జెండా కర్ర వేసుకుని ఉత్సాహంతో తిరిగారు.



రూ.31.50 లక్షల సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15: ఎన్నికల నేపథ్యంలో బిల్లులు, రసీదులు లేకుండా తీసుకెళుతున్న రూ.31.50 లక్షలను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. డబ్బు తీసుకెళుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈస్ట్ సీఐ తెలిపిన వివరాల మేరకు.. సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్‌ఐలు పురుషోత్తమరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి సోమవారం పాత మున్సిపల్ ఆఫీసు నుంచి లీలామహల్ సర్కిల్ వైపు వస్తున్న వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ కారును ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.31.50 లక్షలను గుర్తించారు. బిల్లులు, రికార్డులు లేకపోవడంతో సీజ్ చేశారు. వాహనంలోని కరకంబాడికి చెందిన రెడ్డిబాషా, ఉదయభానుమూర్తిలను విచారించి, పంపారు. సీజ్ చేసిన నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుకు 5,892 దరఖాస్తులు

ముగిసిన గడువు • 25న జాబితా విడుదల

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ ఒకటో తేదీనాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. 15వ తేదీ సాయంత్రం నాటికి ఫారం-6 ద్వారా జిల్లావ్యాప్తంగా 5,892 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఇందులో నియోజకవర్గాలవారీగా.. చంద్రగిరిలో 1,200, తిరుపతిలో 1,000, గూడూరులో 870, శ్రీకాళహస్తిలో 830, సూళ్లూరుపేటలో 800, వెంకటగిరిలో 650, సత్యవేడులో 400 ఉన్నాయి. వెయ్యి పరిష్కారం కాగా, 4,892 దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈనెల 25న తుది ఓటర్ల జాబితా రానుంది. గడువు ముగిసినా దరఖాస్తులు స్వీకరిస్తారని, జూన్ 6వ తేదీ తర్వాత వాటిని పరిశీలించి, వచ్చే ఎన్నికలకు ఓటు హక్కు కల్పిస్తామని అధికారులు తెలిపారు. కాగా, తిరుపతి నగరంలో 35వేలకుపైగా బోగస్ ఓట్లు ఉన్నాయని, చంద్రగిరిలోనూ అదే పరిస్థితి ఉందని టీడీపీ నేతలు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ఎన్నికల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. వాటిని తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను ఇవ్వాలని కోరుతున్నారు. అధికారులెలా స్పందిస్తారో వేచి చూడాలి.

25నాటికి ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితా: కలెక్టర్

ఓటర్ల జాబితాకు సంబంధించి ఈనెల 14 వరకు వచ్చిన క్లెయిమ్‌లను 22వ తేదీలోపు పూర్తి చేయాలని సోమవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ ఆఖరు తేదీ 25 నాటికి ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితా సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు.

బంగారం ధరధగలు

నెల రోజుల్లోనే గ్రాముపై రూ.1,200 పెరుగుదల

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15: బంగారం ధర అమాంతం పెరుగుతోంది. నెల రోజుల వ్యవధిలోనే గ్రాము బంగారంపై రూ.1,200 పెరిగింది. మూడు నెలల వ్యవధిలో 20శాతం పెరుగుదల కనిపించిందని తిరుపతి లోని స్వర్ణ వ్యాపారులు చెబుతున్నారు. మునుపటిలా కాకుండా కరోనా తరువాత ధర పైపైకి ఎగబాకుతూనే ఉంది. 24 క్యారెట్ల బంగారం నెల కిందట గ్రాము ధర రూ.6,300 ఉండగా, సోమవారం నాటికి రూ.7,500 చేరుకుంది. శుభ ముహూర్తాల వేళ బంగారం ధర పెరగడంపై జనం ఆందోళన వ్యక్తం చేస్తుండగా ఇన్వెస్టర్లు మాత్రం ఖుషీగా ఉన్నారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణమే దీనికి కారణంగా వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో దాదాపు 430 బంగారం దుకాణాలుండగా అందులో రోజుకు రూ.6.50 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. తిరుపతిలోనే ఏడు కార్పొరేట్ దుకాణాలున్నాయి. చిన్నాచితకా మరో 154 వరకు షాపులున్నాయి. వీటిల్లో మాత్రమే దాదాపు రూ.3.20కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది.



గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము రూ.5,568

గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము బంగారం రూ.5,568 వరకు పలికింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ.1,932 పెరిగి అపరంజి బంగారం ధర రూ.7,500 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,689 చేరుకుంది. ఇంతలా ధరలు పెరగడంతో కొనుగోలుదారుల్లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి.

కల్లివెట్టులోనూ రాజేష్‌కి నిరసన సెగ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు కల్లివెట్టులోనూ నిరసన సెగ తగిలింది. మాకేం మేలు చేశారంటూ ఆదివారం కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడకు చెందిన వైసీపీ నాయకులు.. రాజేష్ కారును అడ్డగించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కల్లివెట్టు గ్రామస్తులు రాజేష్‌ని నిలదీశారు. వైసీపీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న తమకు సమాచారం ఇవ్వకుండా గ్రామానికి ఎన్నికల ప్రచారానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. దీంతో ఆయన వారికి సర్దిచెప్పాల్సి వచ్చింది.

ఎస్వీయూ దూరవిద్య డిగ్రీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన దూరవిద్య డిగ్రీ మొదటి సంవత్సరం (బీఏ, బీకాం, బీఎస్సీ) ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

తిరుచ్చిపై సీతారామ లక్ష్మణ సమేత హనుమంతు దర్శనం



చంద్రగిరి, ఏప్రిల్ 15: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా కన్నులపండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి. తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. సీతారామలక్ష్మణ సమేత హనుమంతు స్వామి అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు పాల్గొన్నారు. చంద్రగిరిలోని కోదండరామాలయంలో ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు.

మండలాల్లో గ్రామ వలంటీర్ల రాజీనామా

తిరుపతిరూరల్, ఏప్రిల్ 15: వివిధ మండలాల్లో పలువురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని 138 మంది రాజీనామా పత్రాలను ఎంపీడీవో దేవేంద్రబాబుకు అందజేశారు. చంద్రగిరి మండలంలో 113 మంది, ఎర్రావారిపాలెం మండలంలో 83 మంది, ఆర్సీపురం మండలంలో 132 మంది రాజీనామా లేఖలను సమర్పించారు. పాకాల మండలంలో 133 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవో నాగేంద్రబాబుకు కార్యాలయంలో అందజేశారు. తిరుపతిరూరల్ మండలంలో పలు పంచాయతీలకు చెందిన దాదాపు 207మంది రాజీనామా చేశారు.

22న భాకరాపేటలో ఉచిత ఖత్నా శిబిరం

భాకరాపేట, ఏప్రిల్ 15: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట ఫాతిమా నగర్‌లోని గౌసియా మసీదులో ఈనెల 22న ఉచిత ఖత్నా శిబిరం ఏర్పాటు చేసినట్లు మైనారిటీ నాయకులు షాజహాన్ తెలిపారు. ఖత్నా చేయించుకున్న పిల్లలకు ఉచితంగా మందులు, నిత్యావసరాలు ఇవ్వనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భాకరాపేట పరిసర ప్రాంతాల ముస్లింలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శాస్త్రోక్తంగా కాళీ హోమం



రామచంద్రాపురం, ఏప్రిల్ 15: వసంత నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా రాయల చెరువు కట్ట శక్తిపీఠంలో సోమవారం కాళీ హోమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మరకటకాళీ శక్తి అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేట్టారు. ఉదయం 9గంటలకు వేదపండితులు హోమం ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ అనంతరం వీరు భక్తులకు దేవీ వైభవాన్ని వివరించి అనుగ్రహ భాషణం చేశారు.

వంగవీటి రాధా సమావేశాన్ని విజయవంతం చేద్దాం

రామచంద్రాపురం, ఏప్రిల్ 15: చంద్రగిరి సమీపంలో తొండవాడ డీపీఎస్ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9గంటలకు వంగవీటి రాధా ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు పసుపులేటి విజయకుమార్ కోరారు. మండలంలోని శెట్టిపల్లి, బలిజపల్లె, నెత్తకుప్పం, బాదూరు, అనుపల్లి, బొప్పరాజుపల్లె ప్రాంతాల నుంచి సభకు భారీగా తరలి రావాలని కోరారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 15: బీసీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతో సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. మండలంలోని బొప్పరాజుపల్లిలో సోమవారం రాత్రి జయహో బీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బింధుమాధవి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం తరువాతే బీసీలకు గుర్తింపు వచ్చిందన్నారు. పులివర్తి నానిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్దన చౌదరి, ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, జేడీ జగన్, నాయకుడు ప్రసాద్, గిరినాయుడు, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల కమ్యుటేషన్ కాలపరిమితి తగ్గించాలి

పాకాల, ఏప్రిల్ 15: పెన్షనర్ల కమ్యుటేషన్ కాలపరిమితి 15 నుండి 12 సంవత్సరాలకు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పాకాల యూనిట్ కార్యవర్గ సభ్యులు కోరారు. స్థానిక పెన్షనర్ల భవనంలో సోమవారం యూనిట్ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామ్ నాయుడు మాట్లాడుతూ 11వ పీఆర్సీలో తగ్గించిన అడిషినల్ క్వాంటమ్‌ను 10, 15 శాతం పునరుద్ధరించాలన్నారు. పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. యూనిట్ సహ అధ్యక్షుడు మునిరత్నంరెడ్డి, కోశాధికారి కె.రామమూర్తి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల భవితకు అండగా తెలుగుదేశం పార్టీ



మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 15: మహిళల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయితీలో మహిళలతో కలిసి 'మహిళా శక్తికి అండగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డల చదువులకు ప్రోత్సాహంగా 'కలలకు రెక్కలు' అనే కార్యక్రమాన్ని టీడీపీ చేపట్టనుందన్నారు. ఈ పథకం కింద ప్రొఫెషనల్ కోర్సులు నేర్చుకునే విద్యార్థినులకు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్ రోడ్డు(అప్ ఘాట్)లో సోమవారం ఓ కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు బయలుదేరింది. మార్గంలోని హరిణి ప్రాంతంలో కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. కారులోని ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. అధికారులు అప్రమత్తమై కారును పక్కకు తొలగించారు. టైర్ పగలడంతోనే ప్రమాదం జరిగిందని భక్తులు తెలిపారు.

మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోండి



మీడియాతో మాట్లాడుతున్న కీర్తన

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 15 : తిరుపతిలో మెడికల్ మాఫియా రాజ్యమేలుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పి.కీర్తన డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ తిరుపతిలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మందుల షాపులు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయన్నారు. వీటిలో నకిలీ, కల్తీ మందులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, వైద్యాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను దోచుకుంటున్నారని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ నాయకులు గుట్టా నాగరాజు, భారతి పాల్గొన్నారు.

చంద్రగిరి

అరాచక పాలన అంతానికి యువత కదలాలి



ఇంటింటా ప్రచారం చేస్తున్న పులివర్తి వినీల్

తిరుచానూరు, ఏప్రిల్ 15: చంద్రగిరిని నాశనం చేస్తున్న అవినీతి, అరాచక, అసమర్థ పాలకుల పీచమణిచేలా యువత కదం తొక్కాలని నియోజకర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ అన్నారు. సోమవారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం, పద్మావతిపురం పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వినీల్ మాట్లాడుతూ ఇక్కడి పాలకులు రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రగిరి అభివృద్ధిని, ప్రయోజనాలను బలిపెట్టడం బాధాకరమన్నారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన డస్ట్‌బిన్లు

తిరుపతి రూరల్, ఏప్రిల్ 15: తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీలకు తడి, పొడి చెత్త సేకరణకు దాదాపు 20 వేల డస్ట్‌బిన్లు చేరుకున్నాయి. ఎంపీడీఓ కార్యాలయానికి చేరిన వీటిని అక్కడ ఓ గదిలో భద్రపరిచారు. వీటిని ఆయా పంచాయతీలకు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ రమేష్‌బాబు వెల్లడించారు.

బెంగళూరులోని శ్రీవారి ఆలయంలో 21నుంచి వసంతోత్సవాలు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రోజూ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 నుంచి ఆరు గంటల వరకు ఆస్థానం ఉంటుంది. సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల వరకు ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. గృహస్తులు (ఇద్దరు) రూ.వెయ్యి చెల్లించి ఒకరోజు వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఈసేవలో పాల్గొన్న గృహస్తులకు ఒక ఉత్తరీయం, రవిక, ఒక పెద్దలడ్డూ, ఒక వడ బహుమానంగా అందజేస్తారని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

వైసీపీ నుంచి టీడీపీలో భారీగా చేరికలు



టీడీపీలో చేరిన చింతకాయల హరిజనవాడ వైసీపీ కార్యకర్తలతో నాని

భాకరాపేట, ఏప్రిల్ 15: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీలో వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారికి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ తీర్థం తీసుకున్న వారిలో వెంకటరామిరెడ్డి, చిన్న స్వామి, పూజా రెడ్డప్ప నాయుడు, బుజ్జి, ప్రసాద్, సిద్దరామయ్య, వెంకటరామయ్య, రంజిత్, తదితరులకు చెందిన కుటుంబాలున్నాయి. మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, కార్యదర్శి మదనమోహన, మునస్వామి నాయుడు, కుమారస్వామిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన చిట్టేచెర్ల వైసీపీ నాయకులతో నాని

ఎర్రావారిపాలెం: నెరబైలు పంచాయతీ చింతకాయల హరిజనవాడకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు సోమవారం టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో చింతకాయల శివకుమార్, మద్దెల సుబ్రమణ్యం, ఆదిత్య, ప్రసాద్, మణి, శ్రీనాథ్, వెంకట్రామయ్య, సుబ్రమణ్యం, దివాకర్, నారాయణ, రాజశేఖర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పార్టీలో చేరి విజయానికి కృషి చేసే వారికి అన్నివేళలా అండగా ఉంటానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ తదితరులు పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని చిన్నగోర్పాడు పంచాయతీ కొత్తవడ్డిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని స్వగ్రామం పులివర్తివారిపల్లెలో ఆయన సమక్షంలో కొత్తవడ్డిపల్లెకు చెందిన మధు, వెంకటేష్, నరసింహులు, హరి తదితరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకుముందు నాని సామిరెడ్డిపల్లె, బండపాకాల, కోనప్పరెడ్డిపల్లె, తోటపల్లె గ్రామాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.



పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరిన కొత్తవడ్డిపల్లె వైసీపీ నాయకులు





సోమవారం ఉదయం భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న తడుకు పంచాయతీ టీఆర్ కండ్రిగ కాలనీవాసులు - సాయంత్రం మంత్రి రోజా సోదరుడు రాంప్రసాదరెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్న దృశ్యం

అటు.. ఇటు.. అటు

పూటకో పార్టీ కండువా

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15: పుత్తూరు మండల పరిధిలోని తడుకు పంచాయతీలో కొందరు తరచూ పార్టీలు మారడం పరిపాటిగా మారుతోంది. రెండు వారాల క్రితం పంచాయతీ పరిధిలోని టీఆర్ కండ్రిగ కాలనీకి చెందిన కొందరు స్థానికులు వైసీపీ కండువా కప్పుకున్నారు. తిరిగి సోమవారం ఉదయం తిరుపతిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. సాయంత్రం అయ్యేసరికి రామకృష్ణాపురం పంచాయతీలో ప్రచారంలో ఉన్న మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో మళ్లీ వైసీపీ కండువాలు కప్పుకోవడంతో స్థానికులు నోరెళ్లబెట్టారు. పార్టీ కండువా కప్పుకుంటే నగదుతోపాటు మద్యం, బిర్యానీ కూడా ఇస్తుండడంతో పూటకో పార్టీ మారుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

తడలో పోలీసుల కవాతు

తడ, ఏప్రిల్ 15: తడలో పోలీసులు కవాతు నిర్వహించారు. సోమవారం సాయంత్రం కేంద్ర బలగాలతో కలసి స్థానిక పోలీసులు తడ బజారు వీధులు, హైస్కూల్ వీధిలో కవాతు చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకుకోవాలని పోలీసులు కోరారు. బృందంలో సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్ఐ నరసింహరావు, సిబ్బంది ఉన్నారు.

కామిరెడ్డీ... నీ ఆటలు సాగనివ్వం: నెలవల

పెళ్లకూరు, ఏప్రిల్ 15: ఆటవిక విధానాలతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఎన్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆటలు ఇకపై సాగనివ్వబోమని సూళ్లూరుపేట నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం పెళ్లకూరులో టీడీపీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకుని శాంతియుతంగా ప్రచారం చేస్తున్న టీడీపీ వాహనంపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సత్యనారాయణరెడ్డి చిల్లకూరును తన సామ్రాజ్యంలా భావిస్తూ ఎవ్వరినీ అడుగుపెట్టనివ్వను అని అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని తాము కోరుకుంటున్నామని, వైసీపీ నేతలు దాడులకు దిగితే ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఇటీవల అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయమై వైసీపీ అగ్రకుల నేతల మధ్య జరిగిన గొడవల్లోకి దళితలను లాగి పరస్పరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటన జరిగి నాలుగు నెలలు కావస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రశాంతతకు నిలయమైన సూళ్లూరుపేటలో వైసీపీ నేతలు ఒకరిపై మరొకరూ దాడులకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు.

ఎన్డీఏతోనే దేశ సమగ్రాభివృద్ధి: వరప్రసాద్

వెంకటాచలం/సర్వేపల్లి, ఏప్రిల్ 15: ఎన్డీఏతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, సర్వేపల్లి గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలసి ప్రచారం నిర్వహించారు. ముందుగా కసుమూరు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వెంకటాచలం మండలం నిడుగుంటపాళెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్రం మంజూరు చేసినవేనని, వాటికి పేర్లుమార్చి జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు కాకుటూరు రవీంద్రారెడ్డి, ఆరుముళ్ల మురళి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మాధవ్, కరీముల్లా, అన్వర్, మౌలానా, పడివేటి శేషయ్య, నలపాలపు వెంకటాద్రి పాల్గొన్నారు.



కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వరప్రసాద్



సోమిరెడ్డితో కలసి ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాద్

గూడూరు: పట్టణంలోని తన నివాసంలో వరప్రసాదరావు ఎన్డీఏ కూటమి నాయకుల సమావేశం నిర్వహించారు. వైసీపీలో తాను ఎంతో విశ్వాసంగా పనిచేశానని, అయినా తనను చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని వరప్రసాదరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, పులిమి శ్రీనివాసులు, యారం వెంకట సుబ్బయ్య, పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్ధన్, మన్నెం శీనయ్య, బూతు సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోదండ రాముని బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన కోదండరామాలయం

చంద్రగిరి, ఏప్రిల్ 15: చంద్రగిరిలోని కోదండ రామాలయంలో బుధవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈసందర్భంగా ఆలయంలో చలువ పందిళ్ళు, విద్యుత్ దీపాలంకరణ, కల్యాణ వేదిక, వాహన మండపం ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. 17వ తేదీ ఉదయం ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం కోదండరామస్వామి హనుమంతు వాహనంపై దర్శనం ఇవ్వనున్నారు. 23న సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుంది. ఆదేరోజు సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. 25వ తేదీ ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు, చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, తర్వాత చక్రస్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 26న శ్రీరామపట్టాభిషేకం జరుగుతుంది.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్ ప్రవీణ్‌కమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రసార మాధ్యమాల్లో రాజకీయ పార్టీల ప్రకటనలకు ముదస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకటనలకు సంబంధించి జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు అనుమతి ఇవ్వడంతోపాటు ప్రింట్ మీడియాలో పెయిడ్ న్యూస్‌ను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు నిర్ణీత నమూనాలో మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్టర్ కానీ పార్టీల వారు వారం రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు బాలకొండయ్య, సుధాకర్, మోహన్ పాల్గొన్నారు.

తరచూ మొరాయిస్తున్న 108

- గర్భిణిని తరలిస్తున్న వాహనానికి పడని గేర్
- మరో 108లో ఆస్పత్రికి తరలింపు

రేణిగుంట, ఏప్రిల్ 15: రోగుల ప్రాణాలు కాపాడాల్సిన 108 వాహనాలు తరచూ మొరాయిస్తున్నాయి. ఫలితంగా ప్రాణాపాయంలో ఉన్న వారు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. శ్రీకాళహస్తికి చెందిన ఓ గర్భిణి అక్కడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఉంది. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి వైద్యులు తిరుపతి ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి నుంచి 108 వాహనంలో ఆమెను తీసుకుని తిరుపతికి బయలుదేరారు. రేణిగుంట -తిరుపతి రోడ్డులో కృష్ణతేజ కళాశాల సమీపంలో పెట్రోల్ బంకు వద్ద 108 వాహనానికి గేర్ పడలేదు. వాహనం ఆగిపోయింది. గర్భిణి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. దీంతో వెంటనే రేణిగుంటకు చెందిన 108 వాహనాన్ని పిలిపించి తిరుపతికి తరలించారు. పట్టణంలో కావడంతో పక్కనే మరో వాహనం అందుబాటులో ఉండడంతో పెద్దగా ఇబ్బంది లేకుండా ఆస్పత్రికి వెళ్లగలిగారు. అదే రేణిగుంట వాహనం వేరే ప్రమాద స్థలానికి వెళ్లి ఉంటే ఈమె నడిరోడ్డుపై అవస్థలు పడాల్సి వచ్చేది.

ఇటీవలి మరమ్మతులు..

ఇటీవల కాలంలో 108లు తరచూ పాడవుతున్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన 108 వాహనం రేణిగుంట బ్రిడ్జిపై నాలుగు నెలల క్రితం మరమ్మతుల కోసం వెళుతూ మూడు రోజులు అక్కడే ఆగిపోయింది. అలాగే రేణిగుంట పంచాయతీకి చెందిన వాహనం నిత్యం మరమ్మతులకు గురవుతూనే ఉంటుంది. శ్రీకాళహస్తి రూరల్ 108 వాహనం ఇటీవల ప్రమాదానికి గురైనా తాత్కాలిక మరమ్మతులతోనే నడుపుతున్నారు. తిరుమల బైపాస్‌లో 108 వాహనాలకు సంబంధించిన కార్యాలయం వద్ద పాడైపోయినవి సుమారు 20 వాహనాల వరకు ఉంటాయి. వాటిని పట్టించుకునేవారు లేరు. వీటికి సంబంధించిన స్పేర్ పార్ట్స్ కోసం చెన్నై వెళ్లాల్సి ఉంటుంది. అయితే నిధులు లేక వాహనాలన్నీ అలాగే నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు వాహనాలను బాగుచేయించి మంచి కండిషన్‌తో ప్రజల కోసం వినియోగించాలని పలువురు కోరుతున్నారు.



గర్భిణిని మరో 108 వాహనంలోకి తరలింపు

పరమశివుడు కొలువైన క్షేత్రమే అరుణాచలం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 15: పరమశివుడు కొండ రూపంలో కొలువైన క్షేత్రమే అరుణాచలం అని ప్రవచనకర్త గరికిపాటి రమేష్‌బాబు అన్నారు. సోమవారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో అరుణాచల వైభవంపై ఆయన మాట్లాడుతూ అరుణాచలంలో గిరిప్రదక్షిణకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ముఖ్యంగా పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ చేయడం ద్వారా శివుడి అనుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసమన్నారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఇండియా కూటమిని గెలిపించుకుందాం

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 15 : సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ నేత హరినాథ్‌రెడ్డి అన్నారు. తిరుపతి నగరం జీవకోనలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పి.మురళి, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చింతామోహన్‌ను గెలిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు నగేష్, రామానాయుడు, జనార్దన్, రాధాకృష్ణ, విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం, ఎన్‌డీ రవి, శివ, కేవై రాజా, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

డీవైఈవోకు ఎస్టీయూ శుభాకాంక్షలు



బాలాజీని అభినందిస్తున్న ఎస్టీయూ నేతలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 15: తిరుపతి డివిజన్ ఉప విద్యాధికారి(డీవైఈవో)గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన కె.బాలాజీకి ఎస్టీయూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, కె.ధనంజయ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం, రాష్ట్ర కౌన్సిలర్ వేణుగోపాల్, డివిజన్ కన్వీనర్ వాసు, నాయకులు మురళి, రమేష్ నాయక్, శ్రీనివాసులు, రఘు, రిటైర్డ్ టీచర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భారతీయ జ్ఞానపరంపరకు శ్రీమద్రామాయణం దర్పణం



తిరుపతిరూరల్, ఏప్రిల్ 15: భారతీయ జ్ఞానపరంపరకు శ్రీమద్రామాయణం నిధి వంటిదని ఖాట్మాండులోని నేపాల్ సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ పద్మప్రసాద భట్టరాయి పేర్కొన్నారు. సంస్కృత వర్సిటీలో శ్రీమద్రామాయణంలోని భారతీయ జ్ఞానపరంపర అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సుకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామాయణంలో అనేక వైజ్ఞానిక అంశాలను వర్ణించడం జరిగిందని, సర్వమానవాళికి అది మార్గదర్శకమని వివరించారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం మాజీ వీసీ ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి మాట్లాడుతూ చతుర్దశ విద్యాస్థానాలు భారతీయ పరంపరకు అత్యంత ముఖ్యమని, శ్రీమద్రామాయణంలో ఈ విషయాలను విశ్లేషించవచ్చని తెలిపారు. కాగా ఈ సదస్సుల్లో పలు దేశాలకు చెందిన దాదాపు 200 మందికిపైగా అధ్యాపకులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు, సాహిత్య సంస్కృతి అధ్యక్షురాలు ప్రొఫెసర్ సి.లలితారాణి, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.రాజగోపాలన్, ప్రొఫెసర్ సి.రంగనాథన్ పాల్గొన్నారు.

జంక్ ఫుడ్స్‌తో ఆరోగ్య సమస్యలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15: జంక్ ఫుడ్స్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని యోగా నిపుణులు డాక్టర్ ముని మంజుల తెలిపారు. ఆరోగ్యంపై పద్మావతి యూనివర్సిటీలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముని మంజుల మాట్లాడుతూ శారీరక వ్యాయామం, యోగా ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సైకాలజిస్టు డాక్టర్ గాయత్రి మాట్లాడారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విభిన్న ప్రతిభావంతులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని డీఆర్వో పెంచలకిషోర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఎన్నికల అధికారులతో సమీక్షించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రతి పోలింగ్‌స్టేషన్‌లోనూ ర్యాంప్‌లు, వీల్ చైర్లు, అంధులకు బ్రెయిలీ బ్యాలెట్ పేపర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, రాధమ్మ, శ్రీహరి, ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తీరుమారని రక్త పరీక్ష కేంద్రం సిబ్బంది

● రిపోర్టుల కోసం గంటల తరబడి రోగుల నిరీక్షణ



తిరుపతి (వైద్యం), ఏప్రిల్ 15 : రుయాస్పత్రిలోని రక్తపరీక్ష కేంద్రం పనితీరు మారడం లేదు. ఇటీవల ఒక రోగికి తప్పుడు నివేదికలు ఇచ్చి విమర్శల పాలైన సిబ్బందిలో ఎటువంటి మార్పూ కనిపించడం లేదు. వైద్యం కోసం వచ్చిన రోగులకు 13 నంబరు గదిలో రక్త పరీక్షలు చేస్తారు. ఉదయం 7 గంటల నుంచి చేసిన పరీక్షల రిపోర్టులను మధ్యాహ్నం మూడులోపు ఇవ్వాలి. వాటిని తీసుకుని రోగులు డాక్టర్లకు చూపించుకుంటారు. అయితే మధ్యాహ్నం 2 గంటల తర్వాత గది తెరిచి 2.30 గంటల లోపు మూసేస్తున్నారు. దీంతో సకాలంలో రిపోర్టులు తీసుకోలేక రోగులు మరుసటి రోజు మళ్లీ రావాల్సి వస్తోంది. సోమవారమూ ఇదే పరిస్థితి కనిపించింది. దీనిపై రుయా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తిరుపతి

17 నుంచి కోదండరాయాలయంలో నవమి వేడుకలు

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 15: కోదండరామాలయంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. 17న శ్రీరామనవమి సందర్భంగా ఉదయం స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం శ్రీరామనవమి ఆస్థానం, రాత్రి హనుమంత వాహనసేవ ఉంటాయని పేర్కొంది. 18వ తేదీ సాయంత్రం సీతారామకల్యాణం జరుగుతుందని, రూ.వెయ్యి చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని తెలిపింది. 19వ తేదీ రాత్రి శ్రీరామపట్టాభిషేకం, 20న ఖనిజతోట ఉత్సవం ఉంటాయని వెల్లడించింది. కాగా, శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు శ్రీరాముల వారికి తెప్పోత్సవం నిర్వహిస్తారు.

ఒంటిమిట్టకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 15 : శ్రీరామనవమిని పురస్కరించుకుని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంటిమిట్టకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట(రామాలయం), నందలూరు (సౌమ్యనాథస్వామి ఆలయం)లకు నాన్ ఏసీ రవాణా, మధ్యాహ్న భోజనం, గైడ్ ఛార్జీలతో కలిపి ఒక్కొక్కరికి రూ.600 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. 17నుంచి 22వ తేదీ వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848850099, 9848884299, 98489 73985లను సంప్రదించాలని కోరారు.

23న వీర హనుమాన్ బైక్ ర్యాలీ

తిరుపతి (ఆటోనగర్), ఏప్రిల్ 15 : వీరహనుమాన్ విజయయాత్రలో భాగంగా ఈనెల 23న నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ భజరంగ దళ్ నాయకులు విష్ణు, నరసింహులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడుతూ 23న సాయంత్రం 4 గంటలకు ఎమ్మార్‌పల్లి కూడలి నుంచి ప్రారంభమై బాలాజీ కాలనీ, గాంధీరోడ్, తిలక్‌రోడ్డు మీదుగా కపిలతీర్థం వరకు ర్యాలీ సాగుతుందని పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు

తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,057 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 27,913 మంది తలనీలాలు సమర్పించారు.

కూటమిలో నయా జోష్

● పట్టాలెక్కిన అసమ్మతి నేతల ప్రచారం
● మూకుమ్మడిగా కదలడంతో శ్రేణుల్లో సంబరం



ఎన్డీఏ కూటమి ప్రచారంలో అభ్యర్థి ఆరణితో పాటు సుగుణమ్మ ఇతర ముఖ్యనేతలు

తిరుపతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఎన్డీఏ కూటమిలో నయా జోష్ కనిపించింది. అసమ్మతి నేతలందరూ ఏకతాటిపైకి వచ్చారు. సోమవారం జరిగిన ప్రచారంలో నేతలంతా మూకుమ్మడిగా కదలడంతో కూటమి శ్రేణుల్లో సంబరం నెలకొంది. కూటమి పార్టీల వైపు నుంచి పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారం మొదలైంది. తిరుపతి అసెంబ్లీ ఎన్డీఏ (టీడీపీ-జనసేన-బీజేపీ) అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించి మూడు వారాలు గడిచిన తర్వాత కూడా కొందరు కూటమి నేతలు అలకపాన్పు దిగకపోవడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నేరుగా రంగంలోకి దిగారు. మూడు రోజుల ముందు తిరుపతికి చేరుకుని అసమ్మతులను చల్లార్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అసమ్మతి స్వరం వినిపించిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, జనసేన నేత కిరణ్ రాయల్‌తోపాటు టీడీపీ నేతలు ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్ సోమవారం ఎన్డీఏ ప్రచారంలో కనిపించారు. అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తరపున 2, 3, 4, 12 డివిజన్లలో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. ఆరణి శ్రీనివాసులుకు గాజు గ్లాసుపైనా, వరప్రసాద్‌కు కమలం గుర్తుపై ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామంతో ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పట్టుకుంది.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15 : వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై సోమవారం తిరుపతి అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టౌన్‌క్లబ్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, ఈస్ట్ స్టేషన్, గిరిపురం, భవానీనగర్, లక్ష్మీపురం సర్కిల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు.

తిరుమలలో..

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'ఫైర్ సర్వీస్-అగ్నిమాపక వారోత్సవాల'లో భాగంగా సోమవారం తిరుమల ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుమల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన చర్యలపై డెమో ఇచ్చారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సిబ్బంది శివరామ్, శంకర్ శెట్టి, రమణమూర్తి, ప్రతాప్, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో పిచ్చి మొక్కల తొలగింపు



చిన్నపిల్లల వార్డు పక్కన ఉన్న సబ్‌స్టేషన్‌లో తొలగించిన మొక్కలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 15 : రుయాస్పత్రిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదకరంగా ఉన్న పిచ్చి మొక్కలతోపాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. చిన్నపిల్లల వార్డు పక్కన ఉన్న సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు, విద్యుత్తు తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్న విషయంపై ఈ నెల 11వ తేదీన ఆంధ్రజ్యోతిలో రుయాలో అస్తవ్యస్తంగా విద్యుత్ వ్యవస్థ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన రుయా అధికారులు శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ మేరకు శుభ్రం చేయడమేగాక సబ్‌స్టేషన్ చుట్టూ ఉన్న కంచెపై రోగుల తడి బట్టలు ఆరేయనీకుండా, సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

హైవే నిర్మాణంలో పంట కాలువ పూడ్చేశారు

వందల ఎకరాలు బీడుగా మారుతున్నాయి - న్యాయం చేయాలని అధికారులకు రైతుల వేడుకోలు



కలెక్టరేట్‌లో వినతిపత్రం చూపుతున్న చిన్నగొట్టిగల్లు మండల వాసులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15: 'చిన్నగొట్టిగల్లు చెరువు కింద 350 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు నుంచి ఈ భూములకు మూడు కిలోమీటర్ల మేర పంట కాలువ ఉంది. చెరువు కింద భాగాన తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పంట కాలువ పూడ్చేశారు. నీరు అందకపోవడంతో వందల ఎకరాలు బీడుగా మారిపోయాయి. న్యాయం చేయండి' అంటూ చిన్నగొట్టిగల్లు రైతులు కలెక్టరేట్‌లో సోమవారం అధికారులకు విన్నవించారు. ఒకటిన్నర సంవత్సరంగా కలెక్టరేట్‌కు తిరుగుతున్నా లాభం లేకపోయిందని వాపోయారు. పంట కాలువపై కల్వర్టు లేదా పైపులైను ద్వారా చెరువు నుంచి పొలాలకు నీరు వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చిన్నగొట్టిగల్లు మండల కేంద్రం నుంచి గ్రామానికి, పొలాలకు వెళ్లడానికి అండర్‌గ్రౌండ్ వంతెన నిర్మించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టుదారులు వాసుదేవశర్మ, గిరిబాబు, ఎల్లప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవో బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ డీఈవోకు అభినందనలు తెలియజేస్తున్న ఆపస్ నాయకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 15: తిరుపతి ఉప విద్యాశాఖాధికారిగా కె.బాలాజి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖాధికారిగా పనిచేసిన ఆయనను ఉప విద్యాశాఖాధికారిగా నియమిస్తూ పాఠశాల విద్య కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డిప్యూటీ డీఈవో ఛాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు డాక్టర్ దేవరాజులు, నాయకులు మహేష్, శరత్ తదితరులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

ఓటమి భయంతోనే గులకరాయి డ్రామాలు



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నారాయణ

తిరుపతి (ఆటోనగర్), ఏప్రిల్ 15 : ఓటమి భయంతోనే సీఎం జగన్ కోడికత్తి తరహాలో గులకరాయి డ్రామాకు తెరలేపారని టీడీపీ నగర అధ్యక్షుడు వట్టికుంట శంకర్‌నారాయణ అలియాస్ చినబాబు ఎద్దేవా చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎంపై దాడి పట్ల ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి స్పందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన తన నివాసానికి రాజారెడ్డి నిలయంగా పేరు పెట్టుకున్నారని, అయితే రాజారెడ్డి రెండవ కుమారుడు వివేకానందరెడ్డి హత్యకు గురైన సమయంలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ డ్రామాలన్నీ ప్రజల దగ్గర పనిచేయవని, టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు రామచంద్రారెడ్డి, బాబూరావు, ప్రకాష్, రామ్మూర్తి రాయల్, ఆర్.సుబ్బరాయుడు, కేవీ రమణ, గోవిందాచారి, జ్యోతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ అన్నదానం



అన్నదానం చేస్తున్న శంకర్‌రెడ్డి దంపతులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15 : తిరుపతి దిశ హెడ్ కానిస్టేబుల్ శంకరరెడ్డి కుమారుడి జన్మదినం సందర్భంగా రుయా ఆస్పత్రిలో రోగులకు, సహాయకులకు సోమవారం అన్నదానం చేశారు. అలాగే కొంకావీధిలోని సాయిబాబా ఆలయంలో 150 మందికి భోజనం అందించారు. ఏటా తన కుమారుడి పుట్టిన రోజున అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

వినూత్నం..ఆరణి ప్రచారం

● ఆసక్తికరంగా నడిచే డిజిటల్ బోర్డులు



తిరుపతి-కరకంబాడి మార్గంలో డిజిటల్ బోర్డులతో తిరుగాడుతున్న యువకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 15: తిరుపతి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సాంకేతికతను ఉపయోగించుకుని నడిచే డిజిటల్ బోర్డులతో చేస్తున్న ప్రచారం అందరినీ ఆకట్టుకుంటోంది. గాజు గ్లాసు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఉన్న బ్యాటరీతో పనిచేసే డిజిటల్ బోర్డులను యువకులు వీపులకు తగిలించుకుని నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో తిరుగుతుండడంతో ఇదేదో బాగుందే అంటూ నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇది ఓటర్లను ఆకర్షించడంతోపాటు కొందరికి ఉపాధి మార్గంగానూ నిలుస్తోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు చెస్ క్రీడాకారుల ఎంపిక



చెస్ క్రీడాకారులకు జ్ఞాపికలను అందించిన అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 15: తిరుపతి చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్ హాస్టల్లో సోమవారం అండర్ 17 చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 50 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా అత్యుత్తమ ఆటతీరు కనబరిచిన బాలుర విభాగంలో కె.లతీష్‌రెడ్డి, సాయిచరణ్, బాలికల విభాగంలో త్రిపురాంబిక, బిల్వానిలయలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో జరిగే ఓపెన్ క్యాటగిరి చెస్ పోటీలలో వీరు పాల్గొననున్నారు. విజేతలను అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, కార్యదర్శి హెచ్.శ్రీనివాససూరి, చీఫ్ ఆర్బిటర్ వి.బాలాజీ, నిరంజన్‌కుమార్, అనిల్‌కుమార్ అభినందించి, జ్ఞాపికలను అందజేశారు.

స్వేచ్ఛగా ఓటేయండి



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15 : ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్వీయూ స్టేషన్ సీఐ మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం బీఎస్ఎఫ్ బలగాలు, వర్సిటీ పోలీసులు కలసి బండారు ఆంజనేయ స్వామి కాలనీ, రాయల్ నగర్, ఆర్సీ రోడ్డు, అన్నమయ్య సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు, న్యూ బాలాజీ కాలనీ, ఎస్కెడీ నగర్, శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ జంక్షన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, బీఎస్ఎఫ్ ఎస్ఐ జీసీ ఘోష్ పాల్గొన్నారు.

రాబోతోంది రామరాజ్యం

● అభివృద్ధి చెందింది భూమన కుటుంబమే..తిరుపతి కాదు!
● ఇంటింట ప్రచారంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



ప్రచారంలో పాల్గొన్న కిరణ్ రాయల్ తదితరులు

తిరుపతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందారే తప్పా తిరుపతిని అభివృద్ధి చేయలేదని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. టీడీపీ పాలనలో ప్రారంభించిన పనులు పూర్తయ్యాయే గాని రాష్ట్ర ప్రభుత్వ నిధులు తెప్పించి ఒక్క పని కూడా చేయలేదన్నారు. సోమవారం 2, 3, 4, 12 డివిజన్లలో కూటమి నేతల సందడి మధ్య ఆరణి శ్రీనివాసులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు అడుగడుగునా హారతులు పడుతూ ఆరణి శ్రీనివాసులుకు తిలకం దిద్ది గెలుపు నీదేనంటూ భరోసా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కరుణాకరరెడ్డి టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్లను గుప్పిట్లో పెట్టుకుని దందాలు సాగించారని ఆరోపించారు. అరాచకపాలన చేసిన తండ్రీ తనయులకు రానున్న ఎన్నికల్లో ప్రజలు రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రావణ రాజ్యం పోయి త్వరలో రామరాజ్యం ఏర్పాటు కానుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కూటమి అభ్యర్థి గెలిచి తీరుతారన్నారు. జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు గాజు గ్లాసుపై ఓటేసి ఆరణిని గెలిపించాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, బీఎల్ సంజయ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయ్ కుమార్, జేబీ శ్రీనివాస్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, దంపూరి భాస్కర్, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, పుష్పావతి, మన్నెం శ్రీనివాసులు, రుద్రకోటి సదాశివం, సింగంశెట్టి సుబ్బరామయ్య, ఆముదాల తులసీరాం, సుబ్బు యాదవ్, కరాటే చంద్ర, పాటకం వెంకటేష్, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, బీజేపీ నాయకుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సుగుణమ్మను ప్రచారానికి ఆహ్వానిస్తున్న ఆరణి

రాక్షస పాలనను అంతమొందించాలి: పాశం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 15: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న రాక్షస పాలనను అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆయన సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక నరసింగరావుపేటలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పాలన సాగించారన్నారు. అవినీతిని ప్రశ్నించే వారిపై దాడులకు దిగడం, అక్రమ కేసులు బనాయించడం వంటి దుర్మార్గాలకు ఒడిగట్టారని ధ్వజమెత్తారు. యువతకు ఉపాధి చూపకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సివస్తోందని, కొంతమంది యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే యువత, మహిళలు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని సరైన అభివృద్ధి మార్గంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందని, త్వరలో జరిగే ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, కనుమూరు హరిచంద్రారెడ్డి, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కేశవ, ఉమాశంకర్‌నాయుడు, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, చంద్రశేఖర్, చంద్రనీల్, గుండాల లీలావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను బెదిరించి రాజీనామా చేయించడం సరికాదు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 15: వైసీపీ నాయకులు వలంటీర్లను బెదిరింపులకు గురిచేసి రాజీనామా చేయించడం మంచిపద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లపై వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను మానుకోవాలన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మోసంచేసిన ప్రభుత్వం వలంటీర్ల ఉద్యోగాలు కల్పించి రూ.5వేలు మాత్రమే వేతనాలుగా ఇస్తోందన్నారు. ప్రజాధనాన్ని వేతనంగా తీసుకుంటున్న వలంటీర్లను వైసీపీ కార్యకర్తలుగా చూడడం సరికాదన్నారు. వలంటీర్లు ఏ రాజకీయ పార్టీలకు పనిచేయకుండా తటస్థంగా ఉంటూ తమ విధులను నిర్వహించాలని సూచించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే వలంటీర్ల వేతనాన్ని రూ. 10వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వర్లురెడ్డి, నరసింహులునాయుడు, రవీంద్రరెడ్డి, వాటంబేడు శివకుమార్, జనార్దనరెడ్డి, శివకుమార్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు గుర్తింపు



ఊట్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి, ఏప్రిల్ 15: టీడీపీలోనే బీసీలకు గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఊట్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్ష్మీసాయిప్రియ, ఎంపీ అభ్యర్థిగా వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, దాసరి రాజగోపాల్ నాయుడు, గోళ్ల మధు యాదవ్, దుర్గాటి నరసింహులు, ఆదిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, కొర్రపాటి రామచంద్ర నాయుడు, దాసరి కోటేశ్వరావు, జనార్దనరెడ్డి, జడపల్లి కోటేశ్వరావు, పులకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి సహకరించండి

వెంకటగిరి, ఏప్రిల్ 15: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద గాండ్లకుల పెద్దలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియతో కలిసి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండంటూ గద్దెనెక్కిన జగన్ నవరత్నాల పేరుతో ప్రజలను మోసగించారని అన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చిన ఆర్థిక సాయాన్ని పన్నులు, చార్జీల రూపంలో వడ్డీతో సహా వసూలు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్టవేయాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

వలంటీర్ల రాజీనామా

పెళ్లకూరు, ఏప్రిల్ 15: పెళ్లకూరు మండలంలోని 216 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామాలను ఎంపీడీవో అన్నపూర్ణరావుకు అందజేశారు.

గూడూరు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 26మంది వలంటీర్లు తమ రాజీనామాలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు.

కోట: మండలంలోని వెంకన్నపాళెం పంచాయతీ పరిధిలోని 9మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీవో శంకరయ్యను కలిసి రాజీనామా పత్రాలను అందజేశారు.

తడలో పోలీసుల కవాతు

తడ, ఏప్రిల్ 15: తడలో పోలీసులు కవాతు నిర్వహించారు. సోమవారం సాయంత్రం కేంద్ర బలగాలతో కలసి స్థానిక పోలీసులు తడ బజారువీధులు, హైస్కూల్ వీధిలో కవాతు చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకుకోవాలని పోలీసులు కోరారు. బృందంలో సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్‌ఐ నరసింహరావు, సిబ్బంది ఉన్నారు.

కామిరెడ్డీ... నీ ఆటలు సాగనివ్వం: నెలవల

పెళ్లకూరు, ఏప్రిల్ 15: ఆటవిక విధానాలతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఎస్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆటలు ఇకపై సాగనివ్వబోమని సూళ్లూరుపేట నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం పెళ్లకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకుని శాంతియుతంగా ప్రచారం చేస్తున్న టీడీపీ వాహనంపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సత్యనారాయణరెడ్డి చిల్లకూరును తన సామ్రాజ్యంలా భావిస్తూ ఎవ్వరినీ అడుగుపెట్టనివ్వను అని అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని తాము కోరుకుంటున్నామని, వైసీపీ నేతలు దాడులకు దిగితే ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఇటీవల అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయమై వైసీపీ అగ్రకుల నేతల మధ్య జరిగిన గొడవల్లోకి దళితలను లాగి పరస్పరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటన జరిగి నాలుగు నెలలు కావస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రశాంతతకు నిలయమైన సూళ్లూరుపేటలో వైసీపీ నేతలు ఒకరిపై మరొకరూ దాడులకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలకు సహకరించాలని, అడ్డగోలుగా వ్యవహరిస్తే మీ ఆటలు సాగనివ్వమని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పేరం రమేష్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మునసూరు రామచంద్రారెడ్డి, వేలూరు హరినాయుడు, కేవీ నాయుడు, నూతలపాటి ప్రసాద్‌నాయుడు, రాధానాయుడు, అక్కరపల్లి మాధవరెడ్డి, సిద్దులయ్యనాయుడు, సూరినాయుడు, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, తాళ్ల యుగంధర్, పునబాక పోలయ్య, యాగాని బెన్నీ, ఆరూరు రమణయ్య, మొడాం బాబు, కన్నలి వాసు, పరుశురామమ్ పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే దేశ సమగ్రాభివృద్ధి: వరప్రసాద్

వెంకటాచలం/సర్వేపల్లి, ఏప్రిల్ 15: ఎన్డీఏతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, సర్వేపల్లి గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలసి ప్రచారం నిర్వహించారు. ముందుగా కసుమూరు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వెంకటాచలం మండలం నిడుగుంటపాళెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్రం మంజూరు చేసినవేనని, వాటికి పేర్లుమార్చి జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు కాకుటూరు రవీంద్రారెడ్డి, ఆరుముళ్ల మురళి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మాధవ్, కరీముల్లా, అన్వర్, మౌలానా, పడివేటి శేషయ్య, నలపాలపు వెంకటాద్రి పాల్గొన్నారు.



సోమిరెడ్డితో కలసి ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాద్



కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వరప్రసాద్

గూడూరు: పట్టణంలోని తన నివాసంలో వరప్రసాదరావు ఎన్డీఏ కూటమి నాయకుల సమావేశం నిర్వహించారు. వైసీపీలో తాను ఎంతో విశ్వాసంగా పనిచేశానని, అయినా తనను చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని వరప్రసాదరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, పులిమి శ్రీనివాసులు, యారం వెంకటసుబ్బయ్య, పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్ధన్, మన్నెం శీనయ్య, బూతు సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుంది: నెలవల

నాయుడుపేట, ఏప్రిల్ 15: ఓటమి భయంతో వైసీపీ నేతల పిచ్చి పరాకష్టకు చేరిందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. 2019లో కోడికత్తి తరహా డ్రామాను జగన్ మళ్లీ పునరావృతం చేశారని ఎద్దేవా చేశారు. పూలదండలో ఏదో గీసుకొని స్వల్ప గాయమైతే దానిని హత్యాయత్నంగా చూపడం సిగ్గుచేటని అన్నారు. సీఎంకు రక్షణ లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లు పూర్తయినా సీఎం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.ప్రశాంతంగా ఉండే సూళ్లూరుపేట నియోజకవర్గంలో 2019 నుంచి అరాచకాలు, దాడులు, ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా, గంజాయి, బియ్యం స్మగ్లింగ్ వంటివి విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ నాయకులే పరస్పరం దాడులకు దిగడం, దళితులను పావులుగా వాడుకొని అట్రాసిటీ కేసులు పెట్టడం పరిపాటైందన్నారు. పెళ్లకూరులో సత్యనారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసులు పెట్టి నెలలుకావస్తున్నా ఇప్పటి వరకు పోలీసులు చర్యలు తీసుకోలేదని లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, తెలుగుయువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, మండల ప్రధాన కార్యదర్శి దేవాడి నాగేంద్రరెడ్డి, మొండెం బాబు, కందమూడి శివకుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్, ఎద్దల ధనంజయరెడ్డి, శిరసనంబేటి రామచంద్రారెడ్డి, పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి

గూడూరు, ఏప్రిల్ 15: అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన గూడూరు పట్టణంలోని చర్చివీధిలో సోమవారం చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు... నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొండూరుసత్రం గ్రామానికి చెందిన చిన్నమస్తానయ్య(65) చర్చివీధిలో ఓ ఇంటి నిర్మాణం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అతను పనిచేస్తున్న ఇంటి సమీపంలో మరో ఇంటి మెట్ల వద్ద తలకు గాయమై రోడ్డుపై పడి మృతిచెందాడు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ పాపారావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నమస్తానయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: సూళ్లూరుపేట మండలం దామానెల్లూరు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు చెందిన టీడీపీ చేరారు. టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ దామానెల్లూరు, డేగవారి కండ్రిగ, సుగ్గుపల్లి గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డేగవారికండ్రిగకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పుట్టు రమణమూర్తితో పాటు పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, ఉగ్గుముడి సర్పంచ్ తాటిపర్తి శ్రీనివాసుల రెడ్డి, రాజసులోచనమ్మ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్ రోడ్డు(అప్ ఘాట్)లో సోమవారం ఓ కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు బయలుదేరింది. మార్గంలోని హరిణి ప్రాంతంలో కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. కారులోని ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. అధికారులు అప్రమత్తమై కారును పక్కకు తొలగించారు. టైర్ పగలడంతోనే ప్రమాదం జరిగిందని భక్తులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు

తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,057 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 27,913 మంది తలనీలాలు సమర్పించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

చిల్లకూరు, ఏప్రిల్ 15: మండలంలోని గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భానుమూర్తిరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఓడూరు, ఉడతావారిపాళెంలో గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కార చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కలెక్టర్ ప్రవీణ్‌కమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రసార మాధ్యమాల్లో రాజకీయ పార్టీల ప్రకటనలకు ముదస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకటనలకు సంబంధించి జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు అనుమతి ఇవ్వడంతో పాటు ప్రింట్ మీడియాలో పెయిడ్ న్యూస్‌ను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు నిర్ణీత నమూనాలో మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్టర్ కానీ పార్టీల వారు వారం రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు బాలకొండయ్య, సుధాకర్, మోహన్ పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 15 : శ్రీరామనవమిని పురస్కరించుకుని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంటిమిట్టకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట(రామాలయం), నందలూరు(సౌమ్యనాథస్వామి ఆలయం)లకు నాన్ ఏసీ రవాణా, మధ్యాహ్న భోజనం, గైడ్ ఛార్జీలతో కలిపి ఒక్కొక్కరికి రూ.600 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. 17నుంచి 22వ తేదీ వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848850099, 9848884299, 9848973985లను సంప్రదించాలని కోరారు.

ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా సతీష్‌రెడ్డి



సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డిని ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది.

అహల్య శాప విమోచన అలంకారం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం బాలాంజనేయస్వామి అహల్యా శాప విమోచన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా బ్రాహ్మణవీధిలోని సీతారాముల ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రుల ఉత్సవాల్లో స్వామివారు కృష్ణ అవతారంలో దర్శనమిచ్చారు.

చంద్రబాబుతోనే యువతకు భవిత: ఆదిమూలం



టీడీపీలో చేరిన వారితో ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 15: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చి యువతకు ఉపాధి వకాశాలు లభిస్తాయని సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కశింమిట్ట, ఇప్పతాంగెల్ పంచాయతీల నుంచి వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువమంది యువత టీడీపీలోకి మారుతున్నారని, చంద్రన్నతోనే వారి భవిష్యత్తుకు గ్యారెంటీ అన్న నమ్మకం ఉందని తెలిపారు. యువత, వారి భవిష్యత్తుకోసమైన సైనికుల్లా పనిచేసి సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీని గెలిపించుకోవాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఇప్పతాంగల్ యువత వినోద్, విక్కీ, హేమాద్రి, శ్రీకాంత్, ఉదయ్, జ్యోతినాథ్, మునిరాములు, రవికుమార్, మహేష్, బొబ్బులి, సుబ్రమణ్యం ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, మాణిక్యం రెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.

సింహ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం, ఏప్రిల్ 15: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారిని సింహ వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతరప్రాకరంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజలనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామివారిని సింహ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారథి, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకుల్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పుత్తూరు డీవైఈవోగా ప్రభాకరరాజు



పుత్తూరు, ఏప్రిల్ 15: పుత్తూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా ప్రభాకరరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణవనం ఎంఈవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై పుత్తూరు డీవైఈవోగా నియమితులయ్యారు. ఆయనును డివిజన్‌లోని ఎంఈవోలు, ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీని గెలిపించండి

వడమాలపేట, ఏప్రిల్ 15: వెనుకబడిన వర్గాల అభున్నతిని కాంక్షించే టీడీపీని గెలపించాలని తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావ్ కోరారు. సోమవారం ఓబీఆర్ కండ్రిగ పంచాయతీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలో బీసీల సంక్షేమ కోసం పలు పథకాలు రూపొందించారని వివరించారు. నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ధనంజయులు నాయుడు, వెంకటయ్య, హేమావతి, ఆదినారాయణ రాజు, సోము, రాధాకృష్ణమరాజు, శ్రావణ్‌కుమార్ వర్మ, సాయి, సుకేష్, శేఖర్, సుధాకర్, శీను, చంద్రరాజు, భాస్కర్‌రెడ్డి, సంజీవరాజు, గురవయ్య, జైలురాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మరమగ్గ కార్మికులకు అండగా ఉంటా: భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 15: సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే మరమగ్గ కార్మికులకు అండగా ఉంటానని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణంలోని ఏకాంబరకుప్పంలో సోమవారం భానుప్రకాష్ ఇంటింట ప్రచారం చేసి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక మరమగ్గ కార్మికులు అన్ని రకాలుగా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడమేగాక, విద్యుత్ ఛార్జీలు తగ్గించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నగరిని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు రజనీకాంత్, వరదరాజులు, నటరాజన్, శ్రీకాంత్, మోహన్, షణ్ముగం, ఇలంగోవన్, దయాలన్, ఆనంద్, నాగరాజు, తనిగవాసన్, కృష్ణ, తులసిలింగం, మురళి తదితరులు పాల్గొన్నారు.



ఏకాంబరకుప్పంలో భానుప్రకాష్ ప్రచారం

టీడీపీలోకి చేరికలు

పుత్తూరు అర్బన్: మండల పరిధిలోని నేసనూరు పంచాయతీకి చెందిన సుమారు 20మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే తొరూరు పంచాయతీ, పైడిపల్లికి చెందిన కృష్ణమూర్తి తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్నది టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వమేనని, నగరి గడ్డపై టీడీపీ జెండా ఎగుర వేసేందుకు అందరూ మద్దతుగా నిలబడు తుండడం సంతోషంగా ఉందన్నారు. రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య, మండల అధ్యక్షుడు రవికుమార్, తడుకు సర్పంచు బొబ్బిలియాదవ్ తదితరులు పాల్గొన్నారు.





సోమవారం ఉదయం భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న తడుకు పంచాయతీ టీఆర్ కండ్రిగ కాలనీవాసులు - సాయంత్రం మంత్రి రోజా సోదరుడు రాంప్రసాదరెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్న దృశ్యం

అటు.. ఇటు.. అటు

పూటకో పార్టీ కండువా

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15: పుత్తూరు మండల పరిధిలోని తడుకు పంచాయతీలో కొందరు తరచూ పార్టీలు మారడం పరిపాటిగా మారుతోంది. రెండు వారాల క్రితం పంచాయతీ పరిధిలోని టీఆర్ కండ్రిగ కాలనీకి చెందిన కొందరు స్థానికులు వైసీపీ కండువా కప్పుకున్నారు. తిరిగి సోమవారం ఉదయం తిరుపతిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. సాయంత్రం అయ్యే సరికి రామకృష్ణాపురం పంచాయతీలో ప్రచారంలో ఉన్న మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో మళ్లీ వైసీపీ కండువాలు కప్పుకోవడంతో స్థానికులు నోరెళ్లబెట్టారు. పార్టీ కండువా కప్పుకుంటే నగదుతోపాటు మద్యం, బిర్యానీ కూడా ఇస్తుండడంతో పూటకో పార్టీ మారుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

విధి నిర్వహణలో అశ్రద్ధ వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పిచ్చాటూరు, ఏప్రిల్ 15: బీఎల్‌వోలు విధి నిర్వహణలో అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్ద ఓటు వేయడంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో వీఆర్‌వోలు, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో టీడీపీ కార్యాలయం ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 15: సత్యవేడులో సోమవారం టీడీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం టీడీపీకి 1982 గాలి వీస్తోందని, ఈ గాలిలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. పరిశీలకులు చంద్రశేఖర్, నాయకులు సుందరరామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్ రెడ్డి, సుధాకర్‌నాయుడు, రామాంజులనాయుడు, గోపినాథ్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రోశయ్య, ఇళంగోవన్‌రెడ్డి, సతీష్‌నాయుడు, తిరుమలరెడ్డి, భాస్కరన్, గోవిందస్వామి, శ్రీనివాసయాదవ్, పరమశివం, నాగరాజుయాదవ్, మురళి, కన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చక్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15: ముక్కంటి అలయానికి అను బంధంగా పట్టణంలోని జట్టిపాళెంలో వెలసిన చక్రేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. సోమవారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన వివిధ పూజా ద్రవ్యాలతో ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. లింగా కారంగా దర్శనమిచ్చే చక్రేశ్వర స్వామిపై కుంకుమను అద్దారు. ఆపై జటాజూటంతో పరమేశ్వర ప్రతిభను చందనంతో ప్రతిబింబించారు. ఈ విశేష అలంకారాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ తగదు



వైద్య పరీక్షలు చేస్తున్న రెడ్డికుమారి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15: ఆరోగ్యం పై అశ్రద్ధ తగదని టాటా ట్రస్టు ప్రతినిధులు సూచించారు. శ్రీకాళహస్తి కొండమిట్ట ప్రాంతంలో సోమవారం రాష్ట్రీయ సేవా సమితి (రాస్), టాటా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిరక్షణపై సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ శరీరంలో రుగ్మతలు పెరగకముందే ముందుగానే జాగ్రత్తలు వహిం చాలని తెలిపారు. అనంతరం మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతి నిధులు రెడ్డికుమారి, మెహతాజ్ మహేంద్ర, రాస్ సిబ్బంది వినోద్, ముఖేష్‌కుమార్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నియంత్రణ


మంటలు అదుపు చేయడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నియంత్రణ సాధ్యమని శ్రీకాళహస్తి అగ్నిమాపక అధికారి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రమాదాల నియం త్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాల్లో మంటలను అదుపు చేసే మెళకువలను ప్రదర్శించారు. ఆర్టీసీ సిబ్బందికి ప్రమాదాలను ముందుగానే అదుపు చేసే విధానాలను వివరించారు.

పేదలకు అన్నదానం

ఏర్పేడు/ రేణిగుంట, ఏప్రిల్ 15: మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా సోమవార మండలంలోని పల్లంపేటలో టీడీపీ నేత రాజకుమార్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బొజ్జల బృందమ్మ నాయకులు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● రేణిగుంటలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పింఆరు. టీడీపీ నాయకులు ముని చంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామి నాయుడు, జ్యోతినారాయణ, పుష్పనాథన్, చిన్నారెడ్డి, కన్నన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయం పంచుకుంటున్నారు..?

● పంచాయతీ టెండర్ కాలం ముగిసినా ● సొంత వారితో వసూళ్లు



రూ.20 బదులు రూ.50 ప్రింట్ చేసి ఇస్తున్న రశీదు

రేణిగుంట, ఏప్రిల్ 15: రేణిగుంట పంచాయతీ ఆదాయాన్ని ప్రజా ప్రతినిధులు వాటాలు వేసుకుని పంచుకుంటున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. మార్చి 31తో పంచాయతీలో మార్కెట్, బస్టాండు పార్కింగ్, వారపు సంత టెండర్ల కాలవ్యవధి ముగిసింది. ఏప్రిల్ 1 నుంచి పంచాయతీ వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రైవేటు, సొంత వ్యక్తుల చేత వసూలు చేయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో బస్టాండు పార్కింగ్ స్థానిక ఆటోలకు రూ.10, బయట ఆటోలకు రూ20 తీసుకునేవారు. నేడు రూ.30 లెక్కన వసూలు చేస్తున్నారని వాహన దారులు ఆరోపిస్తున్నారు. రేణిగుంట పంచాయతీ మార్కెట్‌లో సుమారు 500మంది చిరువ్యాపారులు ఉన్నారు. వీరికి గతంలో రూ.20 గేటు వసూలు చేసేవారు. నేడు రూ.50 లెక్కన వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక రోజూ వివిధ సరుకులు తీసుకొచ్చే లారీలు 40 వరకు వచ్చిపోతుంటాయి. వీటి వద్ద రూ.500 నుంచి వెయ్యి వసూలు చేస్తుంటారు. ఇక వారపు సంత రోజు మాత్రమే రూ.60వేల నుంచి రూ.70వేలు వసూలు అయ్యేది. అయితే పంచాయతీలోని ఓ ప్రజాప్రతినిధి సొంత వ్యక్తికి బాధ్యతలు అప్పగించి వసూలు చేస్తున్నారని ఈ క్రమంలో గతవారం కేవలం రూ.19వేలు మాత్రమే కట్టినట్లు సమాచారం. ఈ నెల ఒకటి నుంచి ఎంత వసూలు అయినది, రోజువారీ పంచాయతీకి ఎంత చెల్లించారు, అసలు చెల్లించారో లేదోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయమై పంచాయతీ ఈవో రవిశంకర్‌రెడ్డిని వివరణ కోరగా బయట వ్యక్తుల వసూళ్లపై తనకు ఫిర్యాదు అందిందని తెలియ జేశారు. వసూలు చేసిన డబ్బును చెల్లించకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిం చారు. దినసరి కూరగాయల మార్కెట్‌లో అదనంగా వసూలు చేయడంలేదన్నారు.

రేపటి నుంచి పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 17 నుంచి 23 వరకు పెద్ద కొట్టాయి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో నాగేశ్వర రావు సోమవారం ప్రకటనలో తెలిపారు.

11 మంది వలంటీర్ల రాజీనామా

తొట్టంబేడు/ ఏర్పేడు: తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట సచివాలయ పరిధిలో ఆరుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్‌కు రాజీనామా లేఖలు అందజేశారు. ● ఏర్పేడుకు చెందిన ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో గిడ్డయ్యకు అందజేశారు.

టీడీపీ కళకళ..వైసీపీ వెలవెల: సుధీర్



బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సమాధి వద్ద కొబ్బరికాయ కొడుతున్న సుధీర్‌రెడ్డి, టీడీపీలో చేరిన రజకులు

తొట్టంబేడు/ఏర్పేడు, ఏప్రిల్ 15: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ కళకళలాడుతుండగా వైసీపీ వెలవెల బోతోందని టీడీపీ ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరులో తొట్టంబేడు మండలం చిలకావారికండ్రిగ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సోమవారం దినేష్, చంద్ర, శ్రీను, పెంచలయ్య, మునిరాజ, శంకర్, వెంకటేష్‌లు తమ మిత్రబృందం 30మందితో కలిసి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, మునిరత్నం పాల్గొన్నారు.

● మాజీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 200 మందికి పైగా రజకులు సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సంజాకుల మురళి, మాజీ కౌన్సిలర్ మల్లిఖార్జున, దొడ్డిపల్లి మురళి, సురేష్, భాస్కర్, వినయ్, గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

● రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఉమాదేవి, సుభద్రమ్మ, వెంకటమ్మ, ధర్మయ్య, యోగేష్, సోని, విజయమ్మ 85 మంది సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

● ఏర్పేడు మండలం కొత్తవీరాపురం సర్పంచ్ చంద్రకళ, మరో 50మంది కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, జడ్పీటీసీ తిరుమలయ్య, పొన్నారావు, రవి నాయుడు, నాగరాజునాయుడు, మురు గన్ ఆధ్వర్యంలో వీరు సోమవారం టీడీపీ తీర్థం స్వీకరించారు. ఊరందూరులో సుధీర్‌రెడ్డి, ఆయన తల్లి బృందమ్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు.

గోపాలన్న సేవలు చిరస్మరణీయం

శ్రీకాళహస్తి, ఎప్రిల్ 15: దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వాడవాడలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన సతీమణి బృందమ్మ, తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, కోడలు రిషితారెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ భవన్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్గిల్ సెంటర్‌లో జావీద్, గాలి గోపురం వద్ద మునికృష్ణ, కిట్టు, గుర్రప్ప శెట్టి, అంబలి స్వామి ఆశ్రమంలో సుబ్బయ్య, బీపీ అగ్రహారంలో పోలూరు శ్రీనివాసులు రెడ్డి, ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానాలు చేశారు. అన్ని చోట్లా బొజ్జల సుధీర్‌రెడ్డి స్వయంగా అన్నం వడ్డించారు. జయరామరావు వీధిలో డాక్టర్ ఉమేష్ రావు ఆధ్వర్యంలో స్వీట్లు పంచి నివాళులు అర్పించారు. పల్లంపేట టీడీపీ కార్యాలయం వద్ద చెంచయ్యనాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మునిరాజనాయుడు, రాంబాబు నాయుడు, కంఠా రమేష్ కార్యకర్తలు, గోపాలన్న అభిమానులు పాల్గొన్నరు.

● శ్రీకాళహస్తి పట్టణంలోని 11, 13వ వార్డుల్లో సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు.


11వ వార్డులో ప్రచారం చేస్తున్న సుధీర్‌రెడ్డి

జగన్ పాలనను బర్తరఫ్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, ఏప్రిల్ 15: గాజు వాకలో చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై కొంత మంది వైసీపీ అల్లరి మూకలు రాళ్లు వేయడాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి ఖండించారు. ఏర్పేడులో సోమవారం రాత్రి ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అంగళ్ల వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సోదరుడు ద్వారకానథ్‌రెడ్డి చంద్రబాబుపై దాడి చేయించారని గుర్తుచేశారు. అలాగే అమరావతిలో రాజధాని రైతుల పరామర్శించడానికి వెళుతున్న చంద్రబాబు బస్సుపై వైసీపీ అల్లరిమూకలు చెప్పులు విసిరారని తెలియజేశారు. ఇప్పుడు గాజువాకలో మరోసారి రాయితో దాడికి దిగారని వివరించారు. ఇవన్నీ సీఎం జగన్ ఆదేశాలతోనే జరిగాయని ఆరోపించారు. తరచూ చంద్రబాబుపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ కలగజేసుకోవాలని విన్నవించారు. వైసీపీ పాలనను బర్తరఫ్ చేయాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచేటి సుబ్రహ్మణ్యం, గాలి కృష్ణవేణి, నిరంజన్, వెంకటయ్య, బాలాజీయాదవ్, శ్రీనివాసులుయాదవ్, మునీంద్రయాదవ్, నల్లపాళెం సుబ్రహ్మణ్యంరెడ్డి, రమణయ్య, శివ పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఏర్పేడు, ఏప్రిల్ 15: మద్యానికి బానిస అయిన ఓ వ్యక్తి మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు.. పెనుమల్లం గ్రామానికి చెందిన వెంకటేష్(30) రోజూ మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయి ఇంట్లో ఎవరూలేని సమయంలో సోమవారం చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలింగ్ నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర కీలకం

సత్యవేడు, ఏప్రిల్ 15: పోలింగ్ నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర చాలా కీలకమని ప్రతి ఒక్కరూ అప్రమత్తతో విధులు నిర్వహించాలని సత్యవేడు ఏఆర్‌వో (సహాయ ఎన్నికల అధికారి) రామాం జనేయులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో పోలింగ్ నిర్వహణ, పోలింగ్ సామగ్రి పరిశీలన తదితర అంశాలపై ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు రోజు ఎన్నికల అధికారులందరూ ఉదయం 7 గంటలకు పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి రెండు సెట్లు ఈవీఎంలు తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ రోజున కేంద్రం వద్ద స్థానిక ఆతిథ్యం స్వీకరించరాదని స్పష్టంచేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, ర్యాంపు, పోలింగ్ కేంద్రం ప్రాంగణంలో షామియాన ఏర్పాటు, వైద్య సదుపాయం, పురుషులకు, మహిళలకు, సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యేక క్యూలైన్, దివ్యాంగులకు రవాణా సౌకర్యం తదితర వసతులు కల్పిం చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ఎలెక్షన్ సీనియర్ అసిస్టెంట్ సురేష్, పలువురు పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

24న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15: ముక్కంటి ఆలయంలో ఈ నెల 24వ తేదీన హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఈవో ఏకాంబరం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆల యంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని తెలియజేశారు. విధులు కేటాయించిన అధికారులు సిబ్బంది ఎలాంటి ఆభరణాలు ధరించకుండా సంప్రదాయ దుస్తుల్లో హాజరు కావాలని ఆయన సూచించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

కేవీబీపురం, ఏప్రిల్ 15: ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాలని తహసీల్దారు శ్రీరాములునాయక్ కోరారు. ఓటుహక్కుపై అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు, వైద్యసిబ్బంది మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. మంచి సమాజం కోసం మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఓటును అమ్ముకోవద్దని తెలియజేశారు. ఓటును అమ్ముకుంటే మన భవిష్యత్తును అమ్మినట్లేనని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెప్ప, డీటీ వెంకటయ్య, ఆర్‌ఐలు సుబ్రహ్మణ్యం, ఎంఈవో శేఖర్, ఈవోపీఆర్డీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల కోసం పోస్టల్ బ్యాలెట్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15: ఈ ఎన్నికల్లో 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ మహమ్మద్ ఆలీఖాన్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలంలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 4నుంచి పోస్టల్ బ్యాలెట్ అంద జేసి వారు ఓటు వేసిన తరువాత కవర్‌లో భద్రపరిచి కార్యాలయానికి చేర్చా లన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, సీనియర్ సహాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు నిర్లక్ష్యంపై నేతన్నల నిరసన


బ్యాంకును ముట్టడించిన చేనేత కార్మికులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 15: ముద్ర రుణాల మంజూరులో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంపై చేనేత కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆ సంఘ నాయకులతో కలసి సోమవారం స్థానిక ఎస్‌బీఐను ముట్టడించారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘ నాయకులు బుర్రా కృష్ణమూర్తి, పృథ్వీరవి మాట్లాడుతూ ముద్ర రుణాల కోసం దరఖాస్తు చేసుకుని సుమారు ఏడాదిగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. తమకు రుణాలు మంజూరు చేసే వరకు బ్యాంకు వద్ద నుంచి కదలబోమని భీష్మించుకు కూర్చున్నారు. సాధ్యమైనంత త్వరగా రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకు క్షేత్రాధికారి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా బ్యాంకు మేనేజరు దురుసుగా ప్రవర్తించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని చేనేత సహకార సంఘ మాజీ ఛైర్మన్ పృథ్వీరవి కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, వెంకటరమణ, శేఖర్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

చేపల కోసం వెళ్లి నీట మునిగి ఒకరి మృతి


బాలాజీ (ఫైల్‌ఫొటో)

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 15: చేపల కోసం వెళ్లి చెరువులో మునిగి ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పల్లమాల పంచాయతీ పరిధిలోని పచ్చాలమ్మ కాలనీలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పచ్చాలమ్మ కాలనీకి చెందిన బాలాజీ(35) కొయ్య బొమ్మల పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం సాయంత్రం పల్లమాల చెరువులో చేపల కోసం నీటిలో దిగాడు. ఈ క్రమంలో ఓ చోట బురదలో ఇరుక్కుపోయి ఊపిరాడక మృతిచెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అనుమానంతో సోమవారం ఉదయం చెరువులో గాలిం చగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యుంజయుడికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామి విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం పురస్క రించుకొని మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధిచేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషే కించారు. వేదమంత్రాలతో విశేష పూజలు నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిళ ఖాతా నుంచి రూ.3.03లక్షలు మాయం

ఏర్పేడు, ఏప్రిల్ 15: సైబర్ నేరగాళ్ల చేతిలో ఓ మహిళ మోసపోయింది. ఆమె ఖాతా నుంచి రూ.3.03లక్షలు ఖాళీ అయిపోయింది. దీంతో ఆమె ఏర్పేడు పోలీసులను ఆశ్రయిం చింది. సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం మేరకు.. ఏర్పేడు మండలంలోని ఇసుకతాగేలి గ్రామానికి గాయత్రి ఏర్పేడు యూనియన్ బ్యాంకులో బిజినెస్ కరస్పాండెంట్‌గా పని చేస్తోంది. ఆమె మొబైల్ సోమవారం పనిచేయకపోవడంతో సంబంధిత నెట్ వర్క్ అధికారులను సంప్రదించింది. కస్టమర్ సపోర్టు నుంచి ఏపీకే ఫైల్ పేరుతో వాట్సప్ అప్లికేషన్ ద్వారా 9826829008 నుంచి మెసెజ్‌లింక్ వస్తుందని వివరాలు ఎంటర్ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని వారు తెలియజేశారు. ఆ మేరకు వచ్చిన లింక్ ద్వారా ఆమె ఫోన్ నెంబరు, వ్యక్తిగత వివరాలు నమోదు చేసింది. వెంటనే నాలుగు విడతల్లో మొత్తం రూ.3.03లక్షలు ఖాతానుంచి ఖాళీ అయ్యింది.

యువతిపై దాడి.. అత్తింటివారిపై కేసు

ఏర్పేడు, ఏప్రిల్ 15: యువతిపై దాడిచేసిన ఘటనలో అత్తింటికి సంబంధించిన ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీతారాంపేట గ్రామానికి చెందిన శిల్ప అదే గ్రామానికి చెందిన సాయికుమార్ గతనెల 6న ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇరుకుటుంబాల మధ్య మనస్పర్థలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఆమె భర్త తరపు బంధువులు శిల్ప పుట్టింటిపై దాడికి పాల్పడ్డారు. శిల్ప తల్లిదండ్రులు గాయపడ్డారు. దీంతో ఆమె సోమవారం రాత్రి ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ శ్రీరామశ్రీనివాసులు విచారించి శిల్ప భర్త సాయికుమార్‌తో పాటు కుటుంబసభ్యులైన వెంకటేశ్వర్లు, నీరజ, సునీత, దేవీప్రసాద్, రఘురామయ్య, రాజేష్, మరో వ్యక్తిపై కేసునమోదు చేశారు.

తరచూ మొరాయిస్తున్న 108

● గర్భిణిని తరలిస్తున్న వాహనానికి పడని గేర్
● మరో 108లో ఆస్పత్రికి తరలింపు

రేణిగుంట, ఏప్రిల్ 15: రోగులు ప్రాణాలు కాపాడాల్సిన 108 వాహనాలు తరచూ మొరాయిస్తున్నాయి. ఫలితంగా ప్రాణాపాయంలో ఉన్న వారు దిక్కుతోచని స్థితిలో పడి పోతున్నారు. శ్రీకాళహస్తికి చెందిన ఓ గర్భిణి అక్కడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందు తూ ఉంది. సోమవారం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి వైద్యులు తిరుపతి ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబసభ్యులు శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి నుంచి 108 వాహనంలో ఆమెను తీసుకుని తిరుపతికి బయలుదేరారు. రేణిగుంట -తిరుపతి రోడ్డులో కృష్ణతేజ కళాశాల సమీపంలో పెట్రోల్ బంకు వద్ద 108 వాహనానికి గేర్ పడలేదు. వాహనం ఆగిపోయింది. గర్భిణి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. దీంతో వెంటనే రేణిగుంటకు చెందిన 108 వాహనాన్ని పిలిపించి తిరుపతికి తరలించారు. పట్టణంలో కావడంతో పక్కనే మరో వాహనం అందుబాటులో ఉండడంతో పెద్దగా ఇబ్బంది లేకుండా ఆస్పత్రికి వెళ్లగలిగారు. అదే రేణిగుంట వాహనం వేరే ప్రమాద స్థలానికి వెళ్లి ఉంటే ఈమె నడిరోడ్డుపై అవస్థలు పడాల్సి వచ్చేది.

ఇటీవలి సమస్యలు కొన్ని..

ఇటీవల కాలంలో 108లు తరచూ పాడవుతున్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన 108 వాహనం రేణిగుంట బ్రిడ్జిపై నాలుగు నెలల క్రితం మరమ్మతుల కోసం వెళుతూ మూడు రోజులు అక్కడే ఆగిపోయింది. శ్రీకాళహస్తి రూరల్ 108 వాహనం ఇటీవల ప్రమాదానికి గురైనా తాత్కాలిక మరమ్మతులతోనే నడుపుతున్నారు. అలాగే రేణిగుంట పంచాయతీకి చెందిన వాహనం నిత్యం మరమ్మతులకు గురవుతూనే ఉంటుంది. తిరుమల బైపాస్‌లో 108 వాహనాలకు సంబంధించిన కార్యాలయం వద్ద పాడైపోయినవి సుమారు 20 వాహనాల వరకు ఉంటాయి. వాటిని పట్టించుకునే వారు లేరు. వీటికి సంబం ధించిన స్పేర్ పార్ట్స్ కోసం చెన్నై వెళ్లాల్సి ఉంటుంది. అయితే నిధులు లేక వాహనాలన్నీ అలాగే నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు వాహనాలను బాగుచేయించి మంచి కండిషన్‌తో ప్రజల కోసం వినియోగించాలని పలువురు కోరుతున్నారు.


గర్భిణిని మరో 108 వాహనంలోకి తరలిస్తున్న దృశ్యం